# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

సెప్టెంబర్, 2023






త్రిభాషామహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

ఎవ్వాని ప్రవచన మెందరో జనులకు
ఆధ్యాత్మశక్తిని అందజేసె
ఎవ్వాని పాండిత్య మెందరో ప్రాజ్ఞుల
పరవశింపగ జేసి వాసిగాంచె
ఎవ్వాని గాత్రంబదెన్నెన్నొ స్తోత్రాలు
అసమాన రీతిలో నాలపించె
ఎవ్వాని చూడ్కులు పృథుబాధలనుదీర్చి
ఆత్మశక్తినొసగి ఆదుకొనియె


వద్దిపర్తి వంశ వార్ధిసుధామూర్తి
సరళవర్తనుండు పరమగురుడు
పరమపూజనీయ పద్మాకరాఖ్యుండు
విశ్వజనహితుండు విబుధవరుడు

—దేవరకొండ రామసుబ్రహ్మణ్యా శర్మ



# వినాయక చతుర్థి
## శుభాకాంక్షలు

## శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి అమృతతుల్యమైన ఆశీస్సులతో



అవధూత దత్తపీఠాధిపతి, జగద్గురు పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి కరకమల సంజాతులు, శ్రీ అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతులు, పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ వారు హైదరాబాద్ లో నిర్వహిస్తున్న శతచండీ యాగం సందర్భంగా అభినవశుక, త్రిభాషామహాసహస్రావధాని, అవధానవిశ్వగురుబ్రహ్మ శ్రీ ప్రణవపీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురుదేవులు శతచండీయాగ వైశిష్ట్యం పై ప్రవచనామృతం అందించారు. ఆ సందర్భంలో స్వామీజీవారు మైసూరు దత్తపీఠానికి ఆస్థాన విద్వాంసులైన గురుదేవులు దత్తపీఠానికి, అప్పాజీవారికి ఆప్తులు, ప్రీతిపాత్రులని, గురుదేవులు చేస్తున్న విశేష ఆధ్యాత్మిక, సాహితీసేవలు అపూర్వమని, ఆనందంతో ప్రశంసించి, ఒక సమస్యను పూరించమని కోరారు.

భండుని భక్తితోఁ గొలువ భారతి విద్యలనిచ్చు నిత్యమున్



ఉ. పండితులైన వారు తన పాదములందున చేరి నిత్యమున్
కొండొక దైవమీవనుచు కొల్వగ మెచ్చుచు వారికిచ్చు బ్ర
హ్మాండకటాహమూర్తియగు ఆ పరమేష్ఠి అతండు ఆ నమ
ద్భండుని భక్తితోఁ గొలువ, భారతి విద్యలనిచ్చు నిత్యమున్

ఈ సమస్తలోకాలని సృష్టి చేసే బ్రహ్మగారు తన పాదాలను సేవించేవారిని, తనను ఆశ్రయించే పండితులను అనుగ్రహిస్తాడు. ఆయన 'ఆనమద్భండుడు' అనగా భండాసురునిచే నమస్కరింపబడుతున్నవాడు. భండాసురుడు బ్రహ్మకై తపస్సుచేసి వరాలు పొందాడన్న వివరణనిచ్చారు. అటువంటి బ్రహ్మను కొలిస్తే భారతి (ఆయన సతి) విద్యలనిస్తుందని అసాధారణవేగంతో సమస్యను పూరించారు. సభాప్రాంగణమంతా కరతాళధ్వనులతో మారుమ్రోగగా, స్వామీజీ చిరునవ్వులతో తాము అనుకున్నట్లుగానే పరమాద్భుతంగా పూరించారని ఎంతో సంతోషించి, విచ్చేసిన భక్తులందరికీ గురువుగారి అసాధారణ ధార, ధారణ గురించి ప్రశంసాపూర్వక వివరణనందించారు. ఇది కేవలం మచ్చుకి మాత్రమే అని, పూర్తిగా చూడాలంటే తొందరలో మైసూరు ఆశ్రమంలో వారి అవధానం మనం ఏర్పాటు చేసుకోవాలన్నారు.

శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్యాత్మికసేవ మీద మరొక పద్యం ఆశువుగా చెప్పమని భక్తులు ప్రార్థించడంతో

కం. ఆద్యంతము హృద్యములగు
పద్యమ్ముల సర్వధర్మమర్మమ్ముల
సద్యోముక్త్యాధ్యాత్మిక
విద్యాప్రద్యోతనుడు, ఇవే వేలనతుల్ !

స్వామీజీ సద్యోముక్త్యాధ్యాత్మిక విద్యాప్రద్యోతనుడు, అనగా తక్షణం ముక్తినిచ్చే ఆధ్యాత్మిక విద్య అనే కిరణములు కలిగిన సూర్యభగవానుడు, వారు నిరంతరం చేసే ఆద్యంతసేవ ఇది. అటువంటి జ్ఞానసరస్వతికి వేలాది నమస్కారములు.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు



సెప్టెంబర్, ౨౦౨౩

సంపుటి-౨

సంచిక-౯


## విషయ సూచిక



| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 04 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 07 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకరి |
| 09 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 11 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 12 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 13 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 15 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 16 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


శ్రీ మహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యోనమః శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**


© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.


"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞ ఎలా నిలుపుకున్నారు?

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు : https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు


# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు


## సంపాదకీయం

### సత్సంగమే సార్థక జీవనం



మానవజన్మ దుర్లభం. జీవితాన్ని జ్ఞానమార్గంలో నడిపినప్పుడు జీవుడే దేవుడవుతాడు. దీనికి బాల్యం నుండి క్రమశిక్షణతో కూడినటువంటి పద్ధతులు నేర్పటం చాలా అవసరం. సత్సాంగత్యం, సజ్జనసేవ, గురుభక్తి, దైవప్రీతి, స్నేహప్రవృత్తి, శీలనిర్మాణం, కరుణ వంటి విషయాలను అలవరుచుకొని వాటిని నిరంతర సాధన ద్వారా నిలబెట్టుకొనడం అవసరం. మానవశరీరాన్ని ఆహారనిద్రాదులకే పరిమితం చేయరాదు. తక్కిన జీవులలో లేని విశిష్టజ్ఞానం మానవుడిలో ఉన్నది. మనస్సు, బుద్ధి, ఆత్మ,విచక్షణ మొదలైన విశిష్టలక్షణాలు మానవుడిలో ఉన్నాయి. పరోపకార స్వభావముతో కూడిన ప్రకృతి అంతా కూడా భగవన్మమయం. ప్రతి జీవిని, ప్రతి వస్తువును భగవద్రూపంగా భావించాలి. జీవులపై నిష్కల్మష ప్రేమ ప్రదర్శించాలి. అప్పుడే జీవునిలోని దైవత్వం వ్యక్తం అవుతుంది. ధర్మ సంస్థాపన కోసం భగవంతుడు వామనావతారం, పరశురామావతారం, రామావతారం, కృష్ణావతారం, బలరామావతారం, బుద్ధావతారం, కల్క్యవతారం మున్నగు మానవ శరీరముతో కూడిన అవతారాలను ఎన్నుకున్నాడు. దైవత్వం ఉన్నా మానవధర్మాలని ఆచరించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. మానవజీవితం పరిపూర్ణం కావడానికి సత్ప్రవర్తన, మాటతీరు, సత్సాంగత్యం, జీవన వ్యవహారశైలి మూలం. సత్సంగం సాధు సంఘం అని పెద్దల మాట. సత్సంగం విశిష్టతను గురించి ఆదిశంకరాచార్యులు "సత్సంగత్వే నిస్సంగత్వం" అంటూ సత్సంగం చివరకు బ్రహ్మతత్త్వానందాన్ని అందిస్తుందని కీర్తించారు. మంచి వ్యక్తితో ఉన్నప్పుడే ఒక వ్యక్తి మహోన్నత వ్యక్తిగా అత్యున్నత శక్తిగా రాణిస్తాడు. అనేక సద్విషయాలు, సత్ప్రవర్తనలు ఇవన్నీ కూడా సత్సంగం వల్లనే పెంపొందుతాయి. నేటి యువత సన్మార్గ జీవితాన్ని నిర్దేశించుకుని వివిధ సత్సంగకార్యక్రమాలను నిర్వహిస్తూ అందులో భాగంగా సత్సంగంలో పురాణాలు చదవడం, ప్రవచించడం, ఆధ్యాత్మిక, ధార్మిక, ఉపన్యాసాలు నిర్విరామంగా కొనసాగించడం చేయాలి., జ్ఞానులైన పౌరాణికుల ప్రవచనాలను విని, వారిని ఆదర్శంగా తీసుకుని సత్సంగ కార్యక్రమాలు నిర్వహించుకోవాలి. తాము బాగుపడి తరించి, ఇతరులను తరింపచేయాలి. ప్రణవపీఠసత్సంగం అందరికీ ఆదర్శం కావాలని, సత్సంగసభ్యులు నిరంతరకృషి చేయాలని, కృషీవలులకు ఎల్లవేళల గురుకటాక్షం ఉంటుందని అనేక మంగళ శాసనాలు చేస్తున్నాను....


వద్దిపర్తి పద్మాకర్

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# విద్యానిధి



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తిపద్మాకర్ గారి అనుగ్రహం తో అంతర్జాల వేదిక పై సామాజిక మాధ్యమం జూమ్ ద్వారా అనేక కార్యక్రమములను నిర్వహించడం జరిగింది



ఈ కార్యక్రమం నిర్వహించిన ఉపాధ్యాయులకు, కార్యక్రమ నిర్వాహకులకు, సహాయకులకు గురుదేవులు మంగళ శాసనములు చేసారు

# పిల్లల్లో సృజనాత్మకతను పెంచటానికి Creative Art తరగతులు నిర్వహించారు

#పర్యావరణ రక్షణ మన బాధ్యత కనుక మట్టి/పసుపు వినాయక తయారీ విధానం నేర్పించారు

#సంస్కృత భాష పై అవగాహన కొఱకు గురుభక్తులందరికి సంస్కృత భాషా తరగతులు నిర్వహించడం జరిగింది

#భారతీయులు అంటే గణితం, గణితం పై పట్టు సాధించటానికి విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం లో తరగతులు నిర్వహించడం జరిగింది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# గుడి-బడి



శ్రీ ప్రణవపీఠం
सत्यं वद - धर्मं चर
ఏలూరు

**కర్నూల్ గుడి-బడి బృందము వారిని కర్నూల్ లో పూజ్య గురుదేవులు అనుగ్రహించి ఆశీస్సులు అందించారు. కర్నూల్ గుడి-బడి బృందం సేవలను గురుదేవులు కొనియాడి సభ్యులందరికీ మంగళాశాసనములు చేసారు**




**పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు గుడి -బడి శిష్య బృందమునకు కొన్ని సూచనలు చేసారు**

★సంప్రదాయములను అనుసరించి బొట్టు పెట్టుకొని మాత్రమే గుడి- బడి కార్యక్రమమునకు వెళ్ళాలి.

★కుటుంబమును, వృత్తిని విస్మరించి బలవంతంగా గుడి-బడి లో పాల్గొంటే గురుద్రోహం అవుతుంది.

★అనవసరపు మాటలను మాట్లాడుతూ నిర్వాహకులను ఇతర సభ్యులను అన్యభావంతో మాట్లాడే వారిని కార్యక్రమంలో అనుమతించవద్దు.

# శ్రీ గణేశ పురాణం



## బ్రహ్మవైవర్త పురాణంలో గణేశోత్పత్తి కథ

పార్వతి అతిథిని కూర్చోమని చెప్పి లోనికి వెళ్ళి అనేక భోజన పదార్థాలు తీసుకొని వచ్చింది. ఆ తల్లి వచ్చేలోపు శ్రీమహావిష్ణువు అదృశ్యుడయిపోయి, పార్వతీపరమేశ్వరులు శయనించిన పానుపుపై గల శివ రేతస్సుతో కలసి ఒక శిశువుగా మారి దర్శనమిచ్చాడు. చంపకపుష్పవర్ణంతో, అనేక చంద్రులకాంతితో, పరమ సౌందర్యమూర్తిగా కనిపించాడు. మన్మథుని కూడా మోహింపజేసే ఆ సుందరుని చూసింది పార్వతి. పద్మనేత్రుడు, ఎఱ్ఱని పెదవులు కలిగినవాడు, మృదువైన, ఒత్తుగా, నల్లగా ఉన్న శిరోజాలు కలిగి, కాళ్ళు చేతులు ఆడిస్తూ, ఆడుకొంటున్న ఆ శిశువును చూచిన వారు మైమరచిపోతారు. పార్వతి, పరమేశ్వరునితో కలసి అతిథిగా వచ్చిన వృద్ధ బ్రాహ్మణునికి ఆహారం పెట్టడానికి, అతని కోసం అటూ ఇటూ వెదకింది. అతిథికి తిండిపెట్టక పోవడం మహాపాపం అనుకొన్నది. "బ్రాహ్మణోత్తమా! ఎక్కడ ఉన్నావు?" అన్నది— జగన్మాత! వృద్ధ బ్రాహ్మణ రూపంలో వచ్చిన వాడు సాక్షాద్విష్ణువు. నీకు పుత్రునిగా మారి మాతృప్రేమను పొందడానికి వచ్చాడు. నీ మంచంపై ఉన్న శిశువును చూడు. సర్వలోకపాలకుడు, పరిపూర్ణుడు, గోలోకపతి అయిన శ్రీకృష్ణుడతడే. పుణ్యక వ్రత ఫలితంగా నీకు బిడ్డ అయ్యాడు. ఈ మహాత్ముడు ప్రథమ పూజలు అందుకొంటాడు. ప్రతికల్పంలోనూ ఏదో ఒక రీతిగా అవతరిస్తుంటాడు. అవతరించినప్పుడు నీకు పుత్రునిగానే వస్తాడు. కానీ జనన కథా విశేషాలు మారుతుంటాయి. ఈతనిని ఒక్కసారి భక్తితో తలచుకొన్న వారికి సర్వవిఘ్నాలూ నశిస్తాయి. పుణ్యాల రాశి. జ్యోతిస్వరూపుడు సనాతనుడు, అయిన పుత్రుని చూడు. ఇతడు ముక్తిని ప్రసాదించే దైవం. భక్తులను అనుగ్రహించే విగ్రహస్వరూపుడు.

ఈ మాటలు విన్న పార్వతి తన శయ్యపై ఉన్న బాలుని చూచింది. పరవశించిపోయింది. శివునితో ఇలా అన్నది – సర్వేశ్వరా! లోపలికి రా. తపః ఫలంగా లభించిన ఈ పుత్రుని చూడు. భూలోక వాసులు పున్నామ నరకం నుండి రక్షించే పుత్రుని కోసం కలవరిస్తారు. పుణ్యం వల్ల పుత్రుడు జన్మిస్తాడు. మన వ్రతం వల్ల సాక్షాత్తుగా కృష్ణపరమాత్ముడే పుత్రరూపంలో వచ్చాడు. సర్వతీర్థ యాత్రలు చెయ్యడం వల్ల, యజ్ఞాలు చేయడం వల్ల, సర్వదానాలు చేయడం వల్ల, భూప్రదక్షిణ వల్ల వచ్చే పుణ్యం, సత్ పుత్రుని కన్నవానికి వచ్చే పుణ్యంలో పదహారవ వంతు కూడా ఉండదు. పార్వతి మాటలు విన్న శంకరుడు పుత్రుని చూచాడు. సంతోషించాడు. అప్పుడు పార్వతీమాత

శిశువును చేతులలోనికి తీసుకొని ముద్దు చేస్తూ ఇలా అన్నది — నాయనా! అమూల్యరత్నంలాగా లభించావు. పరిపూర్ణసనాతన పరబ్రహ్మవు. నాయనా! కారణజన్ముడివి. లోకశ్రేయఃకారకుడవు కావాలి. ఇలా పలికి శివునితో కలిసి ఆ పుత్రునికి ఆశీస్సులిచ్చింది. అనంతరం ఆదిదంపతులు విప్రాదులకు, భిక్షుకులకు అనేక దానాలు చేసారు. హిమవంతుడు బ్రాహ్మణులకు లక్షలాది రత్నాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, గోవులు, సువర్ణముద్రికలు, ముత్యాలు, మాణిక్యాలు, మణులు, ఇంకా పలురకాల దానాలు చేసాడు. శ్రీమహావిష్ణువు, దేవతలు కూడా దానాలు చేసారు. విష్ణువు తన అంశంతో పార్వతీపుత్రుడు అవ్వడం, ఆ సందర్భంగా తమకు అనేక దానాలు లభించడం - ఇవన్నీ చెప్పకొని దానాలు పుచ్చుకొన్నవారు బ్రహ్మానందం పొందారు. గణపతి జనన దినోత్సవాన్ని పండుగ క్రింద జరపాలని నిశ్చయించుకొని, శ్రీమహావిష్ణువు వాద్యఘోష చేసాడు. అప్సరః స్త్రీలతో నాట్యం చేయించాడు. సంగీతం వినిపించాడు. వేదపారాయణం చేయించాడు. పౌరాణికులు పురాణాలు వినిపించారు. హరి మొదలుకొని అందరూ శ్రీ ఉమాపుత్రునికి వరుసగా ఆశీస్సులందించారు.

**విష్ణువు** — బాలకా! శివునితో సమానమైన జ్ఞానం, ఆయుష్షు కలుగుగాక! నాతో సమానమైన పరాక్రమం లభించుగాక! సకల సిద్ధులకు నాయకుడవు అవుదువుగాక!

**బ్రహ్మ** - నీ కీర్తి సర్వజగత్తులలో వ్యాపిస్తుంది. నీవు సకల పూజ్యుడవు అవుతావు.

శ్లో॥ సర్వేషాం పురతః పూజా భవత్యతి సుదుర్లభా ॥

(బ్రహ్మ.పు.తృ.ఖం.అ.10.శ్లో.22)

మొదటి పూజ నీకే జరుగుతుంది. అందరికంటె ముందుగా, నీ పూజ జరుగుతుంది.

**ధర్మదేవుడు** - నా వలె ధర్మ మార్గాన నడుచుకొంటావు. సర్వజ్ఞుడవు, దయాప్రపూర్ణుడివి. శ్రీహరి భక్తుడివి అవుతావు. హరితో సమానుడవు అవుతావు.

**మహాదేవుడు** —

శ్లో॥ దాతాభవ మయాతుల్యః, హరిభక్తిశ్చ బుద్ధిమాన్
విద్యావాన్, పుణ్యవాన్, శాంతో, దాంతశ్చ ప్రాణవల్లభ ॥

(బ్రహ్మ.పు.తృ.ఖం.అ.10.శ్లో.24)

నాతో సమానంగా దానం చేస్తావు. హరిభక్తిని పొందుతావు. బుద్ధిమంతుడవు, విద్యావంతుడవు, పుణ్యాత్ముడవు, శాంతుడవు, దాంతుడవు అవుదువుగాక!

**లక్ష్మి** — నీవున్న చోట నేనుంటాను. నీలో నేనుండి ప్రజలకు సంపదలిస్తాను.

**సరస్వతి** - నాతో సమాన పాండిత్యం, కవితాశక్తి, ధారణాశక్తి, స్మృతిశక్తి, ఆలోచించేశక్తి నీకు కలుగుతాయి.

**సావిత్రి** - నేను వేదమాతను. నీవు వేద పండితుడవై, నా మంత్రాన్ని జపిస్తూ, వేదవాదులలో గొప్పవాడివవుతావు.

**హిమవంతుడు** — శ్రీకృష్ణభక్తి కలిగి, శ్రీకృష్ణునితో సమానమైన కీర్తి పొందుదువుగాక!

**మేనక** - సముద్రుని వలె గంభీరుడవై, మన్మథుని వలె సుందరుడివై, ధర్ముని వలె ధర్మాచరణం చేస్తూ శ్రీపతి లాగా శ్రీలతో శోభిల్లుదువుగాక!

**భూదేవి** — నా వలె ఓర్పు కలిగి ఉంటూ, అందరి విఘ్నాలూ తొలగిస్తూ, విఘ్నాలు లేనివాడివై, సర్వశరణ్యుడవై, సకల శుభలక్షణాలతో వర్ధిల్లు.

**పార్వతి** - నీ తండ్రిలాగా మహాయోగివై, సకల సిద్ధులు పొంది, సిద్ధి ప్రదాతవై, శుభకరుడవై, మృత్యుంజయుడవై, అన్నిటా ఆరితేరిన వాడవై వర్ధిల్లుదువుగాక!

తక్కిన మునులు, సిద్ధులు, దేవతలు అందరూ ఆ బాలుడిని ఆశీర్వదించారు. గణేశజన్మను గురించి వర్ణించినవారు, చెప్పినవారు, విన్నవారు సకలశుభాలను పొందుతారని అందరూ ఏకకంఠంతో పలికారు. గణేశుని జన్మ వృత్తాంతం విన్నవారికి సకల మంగళాలు లభిస్తాయి.

...ఇంకా ఉంది


*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు



# కాలభైరవఅష్టక పారాయణము

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ప్రణవ పీఠం లో వెలసిన కాలభైరవుడి అనుగ్రహం కొఅకు కాలభైరవ అష్టకమును వీలైనన్ని సార్లు పారాయణ చేయమని ఆదేశించారు



గురుదేవుల ఆజ్ఞను అనుసరించి గురుభక్తులు అందరూ సామూహికముగా అనేక వేల సార్లు పారాయణ చేసారు

ఏలూరు శ్రీ ప్రణవ పీఠం లో జరిగిన సామూహిక పారాయణకు గురుభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కాలభైరవుడికి ప్రత్యేక అలంకారములు చేసి అర్చించారు



శ్రీమతి గీత రెడ్డి గారి బృందం 15 రోజులు పాటు ఉదయం 10:00-12:30 వరకు మధ్యాహ్నం 2:30 - 5:00 వరకు అంతర్జాల వేదిక పై టెలిగ్రామ్ కాల్ ద్వారా పారాయణ నిర్వహించారు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ వేంకటేశ్వర రహస్యము



అగస్త్యుడు శ్రీలోలుడితో ఇలా అన్నాడు — నీ పూర్వజన్మలో నీవు చేసిన పాపాలు అన్నీ ఇన్నీ కావు. ముందుగా వాటి గురించి తెలుసుకో. ఇలా పలికి వాడి పూర్వజన్మ కథనంతా వాడికి వివరించాడు. శ్రీలోలుడితో పాటు అక్కడ ఉన్నవారంతా అది విని భయాశ్చర్యాలకు గురి అయ్యారు. "నీ పూర్వపాపం వల్ల ఈ జన్మలో నీకీ దుస్థితి దాపురించింది. పాపం నశించనిదే నీకు ఆరోగ్యమూ రాదు. దారిద్ర్యం తొలగదు. కనుక ముందుగా పాపప్రాయశ్చిత్తం అవ్వాలి. కాలినడకన వేంకటాద్రికి పయనించు. కపిల తీర్థంలో స్నానం చేసి కొండ ఎక్కు. ఘోణ తీర్థానికి వెళ్ళు. ఆ తీర్థంలో సంకల్పం చెప్పకొని స్నానం చెయ్యి. భయంకర బ్రహ్మహత్యాది పాపాలు ఘోణ తీర్థస్నానం వల్ల నశించిపోతాయి. నీ శరీరం ఆరోగ్యంగా తయారవుతుంది. ఆరోగ్యవంతుడవయ్యాక వేంకటాచలాధీశుని దర్శనం చేసుకో. నీ జాతకం బాగుపడుతుంది. నీవు పూర్వజన్మలో అన్నం పెట్టి ఆదరించిన శబరుడిని చంపి, కృతఘ్నుతా పాపాన్ని మూటగట్టుకొన్నావు. ఆ పాపం వల్ల శనైశ్చరుడు వదలక నిన్ను పట్టుకొని పీడిస్తున్నాడు. ఘోణ తీర్థస్నానానంతరం లేదా తుంబుర తీర్థస్నానానంతరం, శ్రీనివాసుని దర్శించుకొన్న వారికి సకల శనిబాధలూ తొలగి, శనైశ్చరానుగ్రహం వల్ల సంపదలు లభిస్తాయి." ఇలా అగస్త్యుడు పలకగా ఆయనకు నమస్కరించి, శ్రీలోలుడు వేంకటాద్రికి పయనమయ్యాడు. కష్టపడి నడచి వెళ్ళి, కపిలతీర్థంలో స్నానం చేసాడు. ఏడుకొండలూ ఎక్కాడు. ఘోణతీర్థంలోనూ, తుంబురతీర్థంలోనూ స్నానం చేసాడు. స్నానప్రభావం వల్ల అతని శరీరం ఆరోగ్యంగా తయారయింది. చర్మవ్యాధి తొలగిపోయింది. అగస్త్యుడికి మనస్సులోనే నమస్కరించుకొంటూ వాడు శ్రీనివాసుని దర్శించుకొన్నాడు. సప్తగిరీశుని కృప వల్ల పూర్వజన్మపాపమంతా నశించి, దారిద్ర్యం తొలగి శ్రీలోలుడు ఐశ్వర్యవంతుడయ్యాడు. పూర్వజన్మ రహస్యమెరిగినవాడు కాబట్టి, భగవత్పాదాలు విడువకుండా కొలుస్తూ, ధర్మాచరణంతో జీవించాడు.

"మానవుల పాపకర్మల వల్ల గ్రహబాధలు కలుగుతుంటాయి. ఒకసారి కర్మాచరణవల్ల కలిగిన దోషం అంత తేలికగా నశించదు. పాపకర్మలు నశించి శుభాలు పొందడానికి కలియుగంలో ఘోణ తీర్థస్నానం, తుంబుర తీర్థస్నానం ఆచరించి తీరాలి. అనంతరం వేంకటేశ్వరుని దర్శనం చేసుకోవాలి. ఘోణతీర్థం ఘోర పాపాలకు ప్రాయశ్చిత్తం"

.... ఇంకా ఉంది

*****

**శ్రీ క్షేత్రం మంత్రాలయం, తుంగభద్ర నదిలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్, వదిలేసిన వస్త్రాలను పూజ్య గురుదేవుల దయతో గుడి -బడి బృందం యథా శక్తి శుభ్రంచేసారు**



**#పుణ్య క్షేత్రములలో ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దు**

**#యాత్రికులు దేవస్థానముల పరిసరములను అశుభ్రముగా ఉంచవద్దు**

**#నది/పుష్కరిణి లో స్నానం చేసినప్పుడు ప్లాస్టిక్ వస్తువులను నీటిలో విడచి కాలుష్యమునకు కారణం కావద్దు**


ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# పురాణం లో మహిళలు

## ఉలూపి

ఉలూపి ఒక నాగ యువరాణి మరియు ఆమె పాండవ సోదరులలో మూడవవాడైన అర్జునుని వివాహం చేసుకొంది. మహాభారతంలో ఉలూపికి భుజగాత్మజ, భుజగేంద్ర కన్యక, భుజగోత్తమ, కౌరవ్య, పన్నగి, పన్నగనందిని, పన్నగసుత, పన్నగాత్మజ, ఉరగతజ మరియు వంటి అనేక పేర్లు ఉన్నాయి. ఈమె ప్రస్తావన మహాభారత ఆదిపర్వములో చెప్పబడినది. ఆమె గంగా నదిలో నీటి అడుగున నాగ రాజ్యాన్ని పాలించిన సర్ప రాజు కౌరవ్యుని కుమార్తె. ఉలూపి ఒక నిపుణురాలైన యోధురాలు. ఒకనాడు ఒక బ్రాహ్మణుడు ధర్మరాజు ఇంటి వెలుపల నిలబడి ఆక్రందన చేయడం చూసిన అర్జునుడు అయ్యా! ఎందుకు ఏడుస్తున్నావు అని అడిగాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు నాయనా! మీ వంటి ధర్మాత్ముల రక్షణలో ఉంటున్న నా హోమధేనువులను దొంగలు ఎత్తుకుపోయారు. ఎంత ఘోషించిన నా ఏడుపువిని వాటిని విడిపించే వాడు కనపడట్లేదు. నా ధర్మకర్మలు నిలిచిపోయాయి. దయచేసి హోమధేనువులను నాకు ఇప్పించు అన్నాడు బ్రాహ్మణుడు. మీ ఆవులు మీకు ఇప్పిస్తాను ఇక్కడే ఉండండి. దొంగలు ఎటు వెళ్ళారో చూపడానికి నా వెంట వద్దురు గాని అని ధనుర్బాణాలు తీసుకురావడానికి ధర్మరాజు ఇంట్లో ప్రవేశించాడు. కానీ అంతలో అర్జునుడికి తమ నియమం గుర్తుకు వచ్చింది. ద్రౌపది ధర్మరాజుకు భార్యగా ఉంటున్న కాలంలో వేరే వారు ఎవరైనా వారి ఇంట ప్రవేశిస్తే నియమ ఉల్లంఘన జరిగి ప్రవేశించిన వారు ఒక ఏడాది పాటు వనవాసము, తీర్థయాత్రలు చేయవలసి ఉంటుంది. అయినప్పటికీ బ్రాహ్మణునికి మేలు జరగాలని భావించి ధనుర్బాణాలు తీసుకొని దొంగలతో పోరాడి జయించి వారు ఎత్తుకుపోయిన గోవులను బ్రాహ్మణుడికి తిరిగి ఇప్పించాడు. తిరిగి ధర్మరాజు వద్దకు వచ్చి మనం పెట్టుకొన్న నియమాన్ని అనుసరించి నీ మందిరం దగ్గరికి వచ్చాను. కాబట్టి ఒక సంవత్సరం పాటు వనవాసం, తీర్థయాత్రలు చేస్తాను అని అన్నాడు. ధర్మరాజు వారించినప్పటికీ అర్జునుడు అరణ్యవాసానికి తగిన విధంగా ఏర్పాటు చేసుకొని కొంతమంది బ్రాహ్మణులను వెంటబెట్టుకొని తీర్థయాత్రలు చేస్తూ అనేక తీర్థాలు సేవించి కొంతకాలానికి గంగానదీముఖద్వారం వద్దకు చేరాడు. అక్కడ అనేకమంది గంగలో స్నానాలు చేయడం, తర్పణాలు విడవటం చూసి అర్జునుడు చాలా ఆనందం పొంది తాను కూడా స్నానం చేసి దేవతర్పణాలు, పితృతర్పణాలు ఇవ్వాలి అని అనుకుంటూ స్నానం చేయటానికి నదిలో దిగాడు. ఆ సమయంలో ఉలూపి అనే నాగకన్య అర్జునుడి అందం చూసి మోహించింది. నీటిలోనే అతనిని పట్టుకొని నీటిలోకి లాగి నాగలోకానికి తీసుకొని పోయి ఒక దివ్యమైన భవనంలోకి చేర్చింది. అర్జునుడు అప్పుడు ఆమెను చూసి ఏమిటి నీ సాహసం? నీవు ఎవరు? ఎవరి కూతురివి? ఇది ఏ దేశం? అని అడిగాడు. నాథా! నేను నాగుల జాతిలో ఐరావత కులానికి చెందిన కౌరవ్యుడు అనే నాగరాజు కుమార్తెను. నా పేరు ఉలూపి. మన్మథుని లాంటి నిన్ను చూసి మోహించాను. మా నాగులకుండే శక్తుల ప్రభావంతో నిన్ను ఇక్కడికి తెచ్చాను. నా కోరిక తీర్చి నా ద్వారా సంతానం పొందు అన్నది. అప్పుడు అర్జునుడు ఉలూపి! నేను కారణాంతరం వల్ల బ్రహ్మచర్యం అవలంబించి తీర్థయాత్రలతో కాలక్షేపం చేస్తున్నాను. నీవు ఇలా అడగడం అధర్మం. నీ మాట ఎలా ఉన్నా, నాకు మహాపాపం చుట్టుకుంటుంది అన్నాడు

అర్జునుడు. కానీ మొండి పట్టుదల వహించినటువంటి ఉలూపి ఆ మాటకు ఒప్పుకోలేదు. "ద్రౌపది విషయంలో మీ అన్నదమ్ములు చేసుకున్న నియమమే అయినా నీవు బ్రహ్మచర్య వ్రతం అని చెప్పి లాభం లేదు. నీవు నా కోరిక తీర్చకపోతే నేను చనిపోతాను. ఆ పాపం నీకు చుట్టుకుంటుంది. ప్రాణం కాపాడటం కన్నా గొప్ప పుణ్యం ఏమీ ఉండదు. నాకు అభయం యివ్వు" అని అంటూ అర్జునుడి పాదాలు గట్టిగా పట్టుకున్నది. అర్జునుడు ఈ పరిస్థితిని గురించి తీవ్రంగా ఆలోచించి చివరికి ఉలూపి కోరికను తీర్చాలని నిశ్చయించుకున్నాడు. అతడు రాత్రి ఆమెతో గడిపాడు. మరునాడు ఉదయం ఆమె అర్జునుడికి ప్రమాదం లేకుండా గంగాద్వారానికి చేర్చింది. ఆమె అర్జునునికి ఏ జలప్రాణి నుండి ప్రమాదం లేకుండా వరం ఇచ్చింది. కొంతకాలానికి ఆమె అర్జునుడి వల్ల గర్భం ధరించి ఇరావంతుడు అనే కొడుకును కన్నది. కురుక్షేత్ర సంగ్రామ అనంతరం పాండవులు అశ్వమేధయాగం చేసిన కొన్ని సంవత్సరాల తరువాత, అర్జునుడు కొడుకైన బబ్రువాహనుడు యాగాశ్వం తన భూభాగంలోకి ప్రవేశించినప్పుడు యాగాశ్వాన్ని అడ్డుకున్నాడు. బబ్రువాహనునికి ఉలూపి యుద్ధ కళ నేర్పించినది. అర్జునుడు తన తండ్రి అని బబ్రువాహనునకు తెలియదు మరియు అతను అర్జునుడి నాయకత్వంలోని గుర్రాన్ని అనుసరించే సైన్యంతో పోరాడాడు. యుద్ధసమయంలో, బబ్రువాహనుడి బాణం అర్జునుడికి తగిలి అతను స్పృహతప్పి పడిపోయాడు. విషయం తెలుసుకున్న ఉలూపి ఘటనా స్థలానికి చేరుకుని నాగులకు మాత్రమే ఉన్న శక్తిని ఉపయోగించి అర్జునుడి ప్రాణాలను కాపాడినది. తరువాత ఉలూపి తండ్రీకొడుకులను బబ్రువాహనుని మరియు అర్జునులను కలిపినది. కలియుగం ప్రారంభమైన తరువాత, పాండవులు ద్రౌపదితో శరీరత్యాగం చేయాలనుకున్న సమయంలో ఉలూపి గంగానదిలోని తన రాజ్యానికి చేరుకున్నది.

*****

## శుక్లాంబరధరం అనే పద్యానికి గణేశునికి సంబంధం

శుక్ల అంటే తెల్లని, అంబరం అంటే వస్త్రం.విఘ్నేశ్వరుడు ఎప్పుడూ శ్వేత వస్త్రధారి అని గణేశ పురాణంలో ఉంది.విఘ్నేశ్వరుడికి తెల్లని వస్త్రం అంటే చాలా ఇష్టం.అందుకే వినాయక చతుర్థి నాడు పూర్వం ప్రతిమలకు విగ్రహాలకు తెల్లని వస్త్రము కట్టేవారు.అంబరము అంటే వస్త్రం.

**శుక్ల అంబరధరం:-** తెల్లని వస్త్రము ధరిస్తాడు ఆయన

**విష్ణుం:-** విష్ణు శబ్దానికి అంతటా వ్యాపించేవాడు అని అర్థం విష్ణువే గణపతి రూపంలో పార్వతీ దేవి పుత్రుడు అయ్యాడు, అందువల్ల కూడా ఆయన విష్ణు స్వరూపుడు.

**శశివర్ణం:-** విఘ్నేశ్వరుడు ఎంత తెల్లగా ఉంటాడంటే చంద్రుడు ఎంత తెల్లగా ఉంటాడో అంతటి తెల్లగా ఉంటాడు

**చతుర్భుజుడు:-** నాలుగు చేతులు కలిగి ఉంటాడాయన.

**ప్రసన్న వదనం:-** గజముఖం కలిగిన వాడు, చాలామందికి ప్రసన్న వదనం అంటే సంతోషంగా కనిపిస్తాడు, సంతోషకరమైన ముఖం కలవాడు అని అర్థం తెలుసు. ప్రసన్న వదనుడు అంటే కేవలం సంతోషకరమైన ముఖం కలవాడు అనే కాదు, గజముఖుడు అని కూడా అర్థం ప్రసన్న శబ్దమునకు ఏనుగు అని అర్థం .ప్రసన్న వదనుడు అంటే వెరసి గజముఖుడు అటువంటి విఘ్నేశ్వరుడిని,

**ధ్యాయేత్:-** ధ్యానిస్తున్నాను

**సర్వవిఘ్నోప శాంతయే:-** అన్ని విఘ్నములు తొలగాలని ప్రసన్నవదనుడైన విఘ్నేశ్వరుడిని ధ్యానం చేస్తున్నాను

**శ్రీ మహాగణాధిపతయే నమః**

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 323. కదంబ కుసుమ ప్రియా – ఓం ఐం హ్రీం శ్రీం కదంబ కుసుమ ప్రియాయై నమః



కదంబము అనగా కడిమి చెట్టు. ప్రణవపీఠంలో కదంబవృక్షాలున్నాయి. వాటి పూలు గుండ్రంగా ఉంటాయి. కదంబ పుష్పాలు అంటే అమ్మవారికి చాలా ఇష్టం. కదంబకుసుమ సమాసానికి వివిధ పుష్పాల సమూహం అని కూడా అర్థం. అనేక విధాలైన పూలను అమ్మ ఇష్టపడుతుంది అని అంతరార్థం. కదంబ వృక్షం కోరికలు తీర్చే కల్పవృక్షం వంటిది. అమ్మవారు, ఈ పూలను సమర్పించిన వారికి తత్ క్షణం కోరికలు తీర్చి అనుగ్రహిస్తుంది. పూర్ణిమ నాడు ఈ పూలతో అమ్మను పూజించడం మరింత శుభప్రదం.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

ధర్మబద్ధమైన కోరికలు తీరడానికి ఈ మంత్రం జపించాలి. అనగా వివాహం కావడానికి, ఉద్యోగప్రాప్తికి, విద్యాభివృద్ధికి, వంశాభివృద్ధికి ఈ మంత్రం కల్పవృక్షం వంటిది. తొంబది దినాలు దినమునకు 1000 సార్లు చొప్పున ఈ మంత్రాన్ని జపిస్తూ, లభించినప్పుడు కదంబపుష్పాలతో కాని, ఆకులతో కాని అమ్మవారిని పూజించాలి. నైవేద్యంగా అప్పాలు సమర్పించాలి. నివేదన చేసిన పదార్థాలు తాము తిని, ఇతరులకు కూడా పెట్టాలి. ఈ మంత్ర జపం చేసే కాలంలో పరులకు కీడు తలపెట్టకూడదు. తప్పక సంవత్సరంలోపు కోరికలు తీరతాయి. ఈ మంత్ర జపం చేసే కాలంలో సమయం దొరికినప్పుడు గురుదర్శనం చేసుకోవడం వల్ల, అమ్మవారికి ప్రదక్షిణలు చేయడం వల్ల ఫలితం త్వరగా లభిస్తుంది.

*... మరొక నామార్థ వివరణ వచ్చేసంచికలో*

*****

# ఋషి చరిత్ర

## పశ్చిమదిక్కు తపస్సు

యాగం సమాప్తి అవడానికి ముందే ఇంద్రుడు వచ్చి యాగంతో సంతృప్తి చెందాను ,యాగానికి కోటి రెట్ల ఫలాన్ని ఇస్తున్నాను అని చెబుతాడు. ఇది విన్న శునశ్శేపుడు ఎంతో ఆనందంతో అంబరీష మహారాజు రథం ఎక్కి యాగానికి చేరు కొంటాడు. యాగంలో శునశ్శేపుడిని యూపస్తంభానికి కట్టేస్తారు. అయినా శునశ్శేపుడు కలత చెందక విశ్వామిత్రుడు ఉపదేశించిన రెండు మంత్రాలు బాగా మననం చేసుకుంటూ ఉంటాడు.ఇంద్రం ఇంద్రానుజం చైవ. దీనితో ప్రీతి చెందిన ఇంద్రుడు యాగ సమాప్తికి మునుపే వచ్చి యాగంతో సంతృప్తి పొందాను అని చెబుతాడు. అంతే కాకుండా శునశ్శేపునికి దీర్ఘాయువు ఇవ్వడంతో శునశ్శేపుడు యూప స్తంభం నుండి విడుదలై స్వేచ్ఛగా తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోతాడు.ఆవిధంగా శునశ్శేపుడిని రక్షిస్తాడు.తపశ్శక్తి శునశ్శేపునికి ధార పోయడం వల్ల మరల అక్కడే వెయ్యేళ్ళు తపస్సు చేస్తాడు.

## పుష్కర క్షేత్రమున తపస్సు-- ఋషి అగుట

పశ్చిమ తీరంలోని పుష్కర క్షేత్రంలో తపస్సు చేస్తాడు. దీక్షాంత స్నానము చేసాక తపఃఫలము ప్రసాదించుటకు దేవతలు, బ్రహ్మ వస్తారు. బ్రహ్మ "విశ్వామిత్రా! నిష్ఠతో తపః పరమైన శుభకర్మలు చేసావు. ఋషివైతివి" అని అంతర్ధానమవుతాడు.విశ్వామిత్రుడు ప్రీతి చెందక బ్రహ్మత్వమునకు ఇంకా తీవ్రముగా తపము మొదలెడతాడు..ఆసమయంలో మేనక పుష్కర క్షేత్రంలో స్నానం చేయడానికి వస్తుంది. మేనకను చూసి కాముకుడై

> అప్సరః స్వాగతం తేఽస్తు వస చేహ మమాశ్రమే
> అనుగృహీష్వ భద్రం తే మదనేన సుమోహితమ్.

ఆమెకు ఆశ్రమవాసము కల్పించి మేనకతో రమించడం ప్రారంభిస్తాడు. ఒకటి రెండు రోజులలో రతి క్రీడ ముగించి తపస్సు ప్రారంభిద్దాం అనుకొంటాడు. కాని అది పది సంవత్సరాలకు చేరుకుంటుంది. ఇలా ఉండగా ఒక రోజు విశ్వామిత్రుడికి పది సంవత్సరాలు అయిపోయాయి అని స్ఫురణలోకి వస్తుంది. తపశ్శక్తిని నాశనము చేయుటకు దేవతల పన్నాగమని గ్రహిస్తాడు.భయముతో వణుకుతున్న మేనకతో సానునయముగా మాట్లాడి పంపించివేస్తాడు.ఋషికి తపస్సు వల్ల కొంత ఇంద్రియ నిగ్రహము వచ్చింది.మేనక,విశ్వామిత్రులకు జన్మించినదే శకుంతల.ఆమె కుమారుడే భరతుడు.పశ్చిమ తీరం నుండి మరల బయలు దేరి ఉత్తరాన హిమాలయాలకు చేరుకొంటాడు.

## ఉత్తర తీరాన తపస్సు - మహర్షి

ఉత్తర తీరానికి వెళ్ళి,అక్కగారైన సత్యవతి కౌశికి నది రూపంలో ఉండగా అక్కడ ఘోరాతి ఘోరమైన తపస్సు చేస్తాడు. వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసేటప్పటికి ఆ తపస్సుకి ప్రీతి చెంది చతుర్ముఖ బ్రహ్మ వచ్చి "విశ్వామిత్రా! నీ తపస్సుకి మెచ్చాను. నువ్వు మహర్షివి అయ్యావు" అని అంటాడు. విశ్వామిత్రుడు బాధపడక, ఆనందించక బ్రహ్మతో తాను జితేంద్రియుడిని అయ్యానా అని ప్రశ్నిస్తాడు. దానికి సమాధానంగా బ్రహ్మ జితేంద్రుడివి కాలేదు, ఇంకా తపస్సు చేయవలసి ఉంది అని చెప్పి అంతర్ధానం అవుతాడు. బ్రహ్మ అదృశ్యమై పోయాక మళ్ళీ ఘోరాతి ఘోరమైన తపస్సు చేయడం ఆరంభిస్తాడు.

...ఇంకా ఉంది

*****

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు


## కాశీ కథలు



కాశీ క్షేత్రము జీవాత్మకు పరమాత్మకు వారధి.జీవులు తప్పకుండా కాశీ విశ్వనాథుడిని ఆశ్రయించాలి. నిత్యం కాశీ స్మరణ చేసే వారికి పాపం చేయాలి అన్న ఆలోచన కూడా రాదు. కాశీ క్షేత్రం సర్వదేవతలకు ప్రియమైన నగరం. కాశీ క్షేత్రం ముముక్షువులకు నిలయం. కాశీ క్షేత్రం ధర్మక్షేత్రం. సృష్టికి ముందు నుంచే కాశీ ఉన్నది. అన్ని పురాణములలోనూ కాశీ యొక్క మాహాత్మ్యం ఉంటుంది. కాశీని దర్శించని వాడి జన్మ వ్యర్థం. కాశీ పట్టణంలోని ప్రతి రాయి శంకరుడే, ప్రతి నీటి బిందువు గంగయే.విశాలాక్షి సమేతంగా కాశీ యందు వెలసిన విశ్వనాథుడి వైభవం ఇంత అని చెప్పటం అసాధ్యం. విశ్వనాథుడి కరుణ పొందలేని జీవికి బంగారు కిరీటం ధరించినా అది ముళ్ల కిరీటంతో సమానమే. భక్తితో కాశీలో ఒక్కసారి అడుగుపెట్టినా చాలు, మనలో అజ్ఞానాన్ని తొలగించి ఆ శంకరుడే స్వయంగా మోక్ష జ్ఞానము అనే మొక్కను మన హృదయంలో నాటుతాడు. జ్ఞానం లేకుండా మోక్షం సాధ్యపడదు. ఆ జ్ఞానం కలియుగ మనిషికి కాశీ ద్వారా లభిస్తుంది.పూజ్య గురుదేవులు భాగవత కళ్యాణకృష్ణ వద్దిపర్తి పద్మాకర్ గారి అనుగ్రహం వలన మనం ఇప్పటివరకు ద్వాదశ ఆదిత్యులలోని ఆరు ఆదిత్య రూపముల గురించి తెలుసుకున్నాము. ఈ సంచికలో అరుణాదిత్యుడు గురించి తెలుసుకుందాము. శివకార్యము పూర్తి చేయకుండా మందరాచలమునకు ఎలా వెళ్ళగలను?శివాజ్ఞ పూర్తి చేయకుండా వెళితే శివుడి ఆగ్రహమునకు గురికాక తప్పదు అని భావించాడు సూర్యుడు. ధర్మ స్వరూపమైన కాశీయందే నివసించాలని నిశ్చయమైన నిర్ణయము తీసుకున్నాడు. విశ్వములో అందరూ కాశీవాసం కోరుకుంటారు కానీ అందరికీ ఈ భాగ్యం దక్కదు కదా! కాశీవాసం వలన నా తేజస్సు మరింత పెరుగుతుంది తప్ప తరగదు అని సూర్యుడు భావించాడు. శివుడు కరుణా సముద్రుడు. కాశీ వాసం వలన ఆయన అనుగ్రహం తప్పక పొందగలను అని నిర్ణయం తీసుకున్నాడు. ద్వాదశ రూపములతో కాశీలో ఉండిపోయాడు ప్రత్యక్ష దైవం అయిన సూర్యభగవానుడు. లోలార్క ఆదిత్య, ఉత్తరార్క ఆదిత్య, సాంబాదిత్య, ద్రౌపదాదిత్య, మయూఖాదిత్య, ఖఖోల్కాదిత్య, అరుణాదిత్య, వృద్ధాదిత్య, కేశవాదిత్య, విమలాదిత్య, గంగాదిత్య, యమాదిత్య. ఇలా పన్నెండు రూపములతో సూర్యుడు కాశీక్షేత్రం లో భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

శ్లో|| లోలార్క ఉత్తరార్కశ్చ సాంబాదిత్యస్తథైవచ|
చతుర్థాద్రుపదాదిత్యో మయూఖాదిత్య ఏవచ||

శ్లో|| ఖఖోల్కశ్చారుణాదిత్యో వృద్ధకేశవసంజ్ఞకౌ|
దశమో విమలాదిత్యో గంగాదిత్యస్తథైవ చ||

శ్లో|| ద్వాదశశ్చ యమాదిత్యః కాశీపూర్యాం ఘటోద్భవ|
తమోధికేభ్యోదుష్టేభ్యః క్షేత్రం రక్షన్త్యామీసదా||

(స్కాం. పు, కా.ఖం, అధ్యా:46, శ్లో:45,46,47)

### అరుణాదిత్యుడు

అగస్త్యుడు స్కందుడిని ఈ విధంగా ప్రశ్నించెను " ఓ పార్వతీహృదయనందన! సర్వజ్ఞా! ఏ కారణము వలన

పరమ పతివ్రత అయిన వినత దాస్యము చేయవలసి వచ్చినది?" అందుకు స్కందుడు "ఓ మహామతి వినతకు కశ్యపుడి వలన ముగ్గురు సంతానం కలిగిరి. కద్రువకు కశ్యపుడి వలన నూరుగురు కుమారులు కలిగిరి. వినతకు మొదటి పుత్రుడు ఉలూకుడు, రెండవ పుత్రుడు అనూరుడు మూడవ పుత్రుడు సుపర్ణుడు. వినత పుత్రుడు ఉలూకుడు గుణహీనుడు ఇతడిని కౌశికుడు అని కూడా అంటారు. పక్షి గణములు అన్నీ వినత పుత్రుడు ఉలూకుడు గుణహీనుడు అని, రాజ్యపాలనకు పనికిరాడు అని నిర్ణయించారు. అప్పటినుండి ఉలూకుడు ఎవ్వరికీ సరిగ్గా కనిపించేవాడు కాదు. వినత తన జ్యేష్ఠ పుత్రుడు యొక్క చింతతో తీవ్రంగా బాధపడసాగింది. అతడి దుర్దశను చూసి తట్టుకోలేకపోయింది. తీవ్ర దుఃఖంతో సుపుత్రుడిని చూడాలి అనే కాంక్షతో తన రెండవ గుడ్డును స్వయంగా పగులగొట్టింది.ఈ గుడ్డు ఎనిమిది వందల సంవత్సరముల గుడ్డు,మరో 200 సంవత్సరములు గడిస్తే సరి అయిన సమయం వచ్చి గుడ్డు నుండి వినత కుమారుడు బయటికి వచ్చేవాడు, కానీ వినత అత్యుత్సాహం వల్ల జరగకూడని అనర్థం జరిగింది. వినత పగులగొట్టిన గుడ్డు లో శరీరం పూర్తిగా ఏర్పడని కుమారుడు కనిపించాడు. ఇతడికి శరీరం సగమే ఏర్పడింది. ఊరువుల పైభాగం మాత్రమే శరీరం ఏర్పడింది. గుడ్డు నుండి బయటకు వచ్చిన శిశువు తీవ్ర ఆగ్రహంతో కనిపించాడు, క్రోధము వలన అతని ముఖం రక్త వర్ణంలో కనిపించింది. బయటకు వచ్చి రాగానే తల్లిని శపించాడు "ఓ జననీ! నీవు నీ సవతి పుత్రులని చూసి ఈర్ష్యతో ఈ పని చేసావు.ఈ పాపము వలన నువ్వు నీ సవతి పుత్రులకు దాసిగా మారెదవు గాక ఇందులో ఎట్టి సందేహము అవసరము లేదు" పుత్రుడి శాపానికి వినత భయపడి, ఏరకంగా ఈ శాపం నుండి బయటపడగలనో తెలియజేయమన్నది,అందుకు అనూరుడు తల్లితో ఇలా పలుకుతాడు "ఓ మాత!ఈ మూడవ అండము పరిపక్వము అయ్యే వరకు,శిశువు వచ్చేవరకు నీవు ఎటువంటి హాని చెయ్యకు. ఇందులో నుండి మహాశక్తివంతుడు మహాత్ముడు జన్మిస్తాడు. అతడు నిన్ను దాసీత్వమునుండి రక్షిస్తాడు." తల్లి వినతకు ఈ విషయము చెప్పి ఆకాశమార్గంలో ఆనందకాననం అయిన కాశీకి వచ్చాడు అరుణుడు . విశ్వేశ్వరుడి కృపతో ప్రతి ఒక్కరికి శుభము లభిస్తుంది."ఓ అగస్త్య! ఇది వినత యొక్క దుర్భరస్థితికి కారణం" అని స్కందుడు తెలియజేసెను.ఊరువులు లేకుండా జన్మించడం వలన ఇతడిని అనూరుడు అంటారు. వచ్చిన వెంటనే తల్లిపై కోపంతో ఇతడి ముఖం రక్త వర్ణంలో ఉండటం వలన ఇతడిని అరుణుడు అని అన్నారు.ఈయన కాశీ క్షేత్రము చేరి విశ్వనాథుడిని దర్శించి సూర్యారాధన చేయసాగెను. కాశీలో ఆదిత్యుడిని ప్రతిష్ఠ చేసి యథాశక్తి అర్చించెను. సూర్యుడు అరుణుడి భక్తికి మెచ్చి అతని ముందు ప్రత్యక్షమయ్యేను. అరుణుడితో ఆదిత్యుడు ఈవిధంగా చెప్పెను "ఓ అనూరా! ఈరోజు నుండి ముల్లోకముల హితము కొఱకు నా రథమును నడిపించు. ఈ కాశీలో విశ్వనాథుడికి ఉత్తర దిశ వైపు నీ ద్వారా ప్రతిష్ఠ చేయబడిన నామూర్తిని ఎవరు ఆరాధిస్తారో వారు సకల దుఃఖముల నుండి, దరిద్రముల నుండి, పాపముల నుండి, వ్యాధులనుండి, పీడల నుండి విముక్తి పొందుతారు. ఇక పై నీవు ఆరాధించిన నా మూర్తిని అరుణాదిత్య అనే పేరుతో భక్తులు అర్చిస్తారు.అరుణాదిత్యుడి భక్తులను,సేవకులను ఎవ్వరూ శోకమునకు గురి చెయ్యలేరు." ఈ విధంగా ఆదిత్యుడు పలికి అరుణుడిని తన రథంపై కూర్చోబెట్టాడు.ఆనాటి నుండి ఈనాటి వరకు సూర్యరథమును అరుణుడే నడిపిస్తున్నాడు. ఎవరు అయితే ఉదయమే నిద్రలేచి సూర్యుడిని అరుణుడిని మొక్కుతారో వారికి ఎట్టి దుఃఖము కలుగదు. ఎవరి చెవులలో అరుణాదిత్య వృత్తాంతం ప్రవేశిస్తుందో వారికి ఎటువంటి కీడు జరగదు ఎటువంటి ఆపదలు కలుగవు.ఇది ద్వాదశ ఆదిత్య రూపములలోని అరుణాదిత్య వృత్తాంతం.

...ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# స్తోత్రమాలిక

## శ్రీ గణేశపంచరత్నమ్

ముదాకరాత్తమోదకం సదా విముక్తి సాధకం
కలధరావతంసకం విలాసిలోకరక్షకమ్ |
అనాయకైకనాయకం వినాశితేభదైత్యకం
నతాశుభాశునాశకం నమామి తమ్ వినాయకం|| (1)

నతేతరాతిభీకరం నవోదితార్క భాస్వరం
నమత్సురారినిర్జరం  నతాధికాపదుద్ధరమ్ |
సురేశ్వరం నిధీశ్వరం గజేశ్వరం గణేశ్వరం
మహేశ్వరం తమాశ్రయే పరాత్పరం నిరంతరమ్ || (2)

సమస్తలోకశంకరం నిరస్తదైత్యకుంజరం
దరేతరోదరం వరం వరేభవక్త్రమక్షరమ్ |
కృపాకరం క్షమాకరం ముదాకరం యశస్కరం
మనస్కరం నమస్కృతాం నమస్కరోమి భాస్వరమ్ || (3)

అకించనార్తిమార్జనం చిరంతనోక్తిభాజనం
పురారిపూర్వనందనం సురారిగర్వచర్వణమ్ |
ప్రపంచనాశభీషణం ధనంజయాదిభూషణం
కపోలదానవారణం భజే పురాణవారణమ్ || (4)

నితాంతకాంతదంతకాంతిమంతకాంతకాత్మజమ్
అచింత్యరూపమంతనహీనమంతరాయకృన్తనమ్ |
హృదంతరే నిరంతరం వసంతమేవ   యోగినాం
తమేకదంతమేవ తం  విచిన్తయామి సంతతమ్ || (5)

మహాగణేశ పంచరత్నమాదరేణ యోన్వహం
ప్రజల్పతి  ప్రభాతకే హృదిస్మరన్ గణేశ్వరమ్|
అరోగతామదోషతాం సుసాహితీమ్ సుపుత్రతాం
సమాహితాయురష్ట భూతిమభ్యుపైతి సోచిరాత్|| (6)

ఇతి శ్రీ శంకర భగవత్పాద కృతం శ్రీ గణేశ పంచరత్నమ్



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# గురుదేవుల జీవన కవనము

## నవమాధ్యాయం

మంత్రోపదేశం చేసిన వారికి సాష్టాంగ నమస్కారం చేయమని తండ్రి చెప్పిన విషయం గుర్తుంచుకొని జంగముడికి పాద నమస్కారం చేసాడు. కళ్ళు మూసి తెరిచేలోపు జంగముడు కనిపించకుండా పోయాడు.జంగముడు మంత్రం ఉపదేశము చేసినప్పుడు బాల పద్మాకరుడు అలౌకిక ఆనందమును పొందాడు. ఇది పద్మాకరుడికి శ్రీశైలంలో జరిగిన రెండవ గొప్ప అనుభూతి. మంత్ర జపం చేసుకుంటూ శ్రీశైలంలోని హాటకేశ్వర మఠానికి చేరుకున్నాడు బాల పద్మాకరుడు. ఇక్కడ బాల పద్మాకరుడికి మరొక గొప్ప అనుభూతి కలిగింది. ఆయనకు మరొక జంగముడు కనిపించి కాశీలో దేవదేవుడైన విశ్వనాథుడిని దర్శించుకునేంతవరకు నీకు జరిగినటువంటి ఈ అద్భుతముల గురించి ఎవ్వరికీ తెలియచేయకూడదు అని బాల పద్మాకురుడికి జంగముడు తెలియజేసాడు. పొరపాటున నీవు తెలిసో తెలియకో ఎవరికైనా చెప్తే నీకు ఆలోచనా శక్తి నశిస్తుంది అని చెప్పాడు అంతేకాదు నీపై నిందలు, అభాండాలు వచ్చి పడతాయి అని హెచ్చరించాడు. బాల పద్మాకరుడు సరే అని తల ఊపాడు. ఈ విధంగా శ్రీశైలంలోనే చాలా రోజులు శివస్మరణ చేసుకుంటూ గడిపాడు. అనుకోకుండా ఒకరోజు గణపవరం నుంచి వచ్చిన గోటేటి సత్యనారాయణ దంపతులు బాల పద్మాకరుడిని చూసి శ్రీ చలపతి గారి అబ్బాయి అని తెలుసుకొని మీ తల్లిదండ్రులు నీకోసం బెంగ పెట్టుకున్నారు నాయనా అంటూ బస్సులో ఎక్కించి జాగ్రత్తగా గణపవరం తిరిగి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. జంగముడి మాటలను గుర్తు పెట్టుకున్న బాల పద్మాకరుడు శ్రీశైలంలో జరిగినటువంటి విషయాలను ఎవ్వరికీ చెప్పలేదు, కానీ అనుకోకుండా ఒక చిన్న విషయాన్ని స్నేహితులతో పంచుకున్నాడు.ఆ క్షణం నుండి కొన్ని సంవత్సరాల పాటు జంగముడు చెప్పినట్టు ఆలోచన మందగించి అనేక నిందలకు గురికావలసి వచ్చింది. అదృష్టం కొద్దీ తండ్రిగారి ఉపదేశ ప్రభావాల వల్ల సన్మార్గంలో నడిచి తిరిగి విద్యాభ్యాసం ప్రారంభం చేసాడు.




....ఇంకా ఉంది

*****

# గుడి-బడి

బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఇచ్చిన పిలుపుతో, గురుభక్తులు అందరూ భక్తితో గుడి-బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో భాగముగా భక్తులు వారి ఊరిలోని ఒక మందిరమును శుభ్రపరచి, సంకీర్తనలు పాడి, నామ స్మరణ చేసుకొని సాధ్యమైన మేరకు అన్నదాన కార్యక్రమములు యథాశక్తిగా నిర్వహించడం జరిగింది. హైదరాబాద్, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, కడప వంటి అనేక నగరములతో పాటు అనేక గ్రామములలో కూడా ఈ కార్యక్రములను గురుభక్తులు నిర్వహించడం జరిగింది. ప్రముఖ దిన పత్రికలలో కూడా గుడి-బడి కార్యక్రమ వివరాలను అందించారు.

